# పోడు....పోరు

'జోగిపురం' కొండ దిగుతున్నాడు బిడ్డిక మంగయ్య. కొండజోల తోవలో పరింకంప ఒంటికి తగలకుండా, డొంకల తీగలు కాళ్లకి తగలకుండా జాగ్రత్తగా నడుస్తున్నాడు. కొండ తోవలోని గొగ్రంచురాళ్ళు పాదాల్ని గీరేస్తున్నా, చింతపండు బరువుతో కావడి – భుజాల్ని మంట పుట్టిస్తున్నా లెఖ్ఖ చేయకుండా, ఆ మధ్యాహ్నపు టెండలో ఒంటిపై చెమటలు ధార కడుతుంటే, కావిడితో కొండ దిగి, కొండవారన గల 'కెమిశీల' వలస తోవ తప్పించేసి – అడ్డుదారిన ఊరి దోవ పట్టాడు!

మంగయ్యది తులసివలస! మంగయ్యని చుట్టుపక్కల వలసలోల్లూ, దిగువ పల్లపోల్లూ అంతా – 'బిడ్డికోడా' అని పిలుస్తారు. బిడ్డికోడికి మొలకి చుట్టిన గోచీ తప్ప, వొంటిమీద గుడ్డ మరేం లేదు. గోచీ బిగించిన మొలతాడుకి, ఎడమప్రక్కగల కర్రగొట్టంల ఆర్పేసిన సుట్టముక్క వుంది. కడుపుకి అంటుకుపోయిన పేగులున్నాయి. ఒంటిమీద..... అక్కడక్కడా పోలీసుల చిత్రహింస గుర్తులున్నాయి.

ఇప్పుడు బిడ్డికోడి మనసులో ఎవ్వరికంటా బడకుండా చింతపండు కావిడి యిల్లు జేర్చాలనే ఆలోచనలున్నాయి. తోవ దప్పించేసి, ఎలాగో ఊరిలోకి చేరాడు. ఇంటి ముందర కావిడి దించి, ఒంగొని, గోచీముందు వేలాడే గుడ్డతోటి మొహమ్మీది చెమటనీ, భుజాలనీ, చంకల్నీ తుడుచుకున్నాడు. ఇంట్లోకెల్లి, 'అటికి'లోనున్న గెడ్డనీరు 'డోకి' తోటి తీసి గటగటా తాగి, డోకి అక్కడొదిలేసాడు. బయటికొచ్చి, కావిడి కొమ్ము విప్పి చింతపండు తట్టలు రెండింటినీ గడపలోకి మోసుకొచ్చాడు. చింతపండు కొనటానికి ఆ రోజు కొమరాడనుండి జనార్ధనం మేస్టారు వస్తామన్నారు. అతనికోసం ఎదురుచూడసాగాడు.

కొంత సేపటికి మేస్టారొచ్చారు. కావిడి చింతపండు తూకం వేసారు. గుడ్డివాడి చేతిలో వజ్రాలుంటే యే మహాత్ముడో అయితే కాజెయ్యటం మానేస్తాడు. గానీ మానవుడు కాజెయ్యకుండా వుంటాడా? అమాయక గిరిజనుల వద్ద గల చింతపండుకూడా ఎత్తుకు ముత్తుం తూచుకుపోకుండా ఎవ్వరూ వుండరు. కానీ జనార్ధనం మేస్టారలాంటివారు కారు. నిజాయితీగలవారు.

"ముప్పయ్యొక్క కేజీలుందిరా బిడ్డికోడా.... పండు! నలభయ్యారున్నర నీకొస్తాది. కేజీ రూపాయిన్నర లెక్కన వేసాను. చూసుకో లెక్కలు..." అని, సిగరేట్ డొక్కుమీద అప్పుడేసిన అంకెలు చూపబోయారు.

"లెక్కలూ డొక్కలూ నాకేటి తెలుత్తాయి మేట్రుగోరో? ఎంతొత్తాదో యిచ్చేయండి." అని చేయి చాపాడు బిడ్డికోడు.

ఇంతలో –

కోడిపెట్టని వెంటదగిలే నక్కలాగ జానలేసుకుంటూ అక్కడికి సవర్రాజు వొచ్చాడు.

బిడ్డికోడు చింతపండుని మేస్టారు తెచ్చిన గోనెసంచిలోకి వొంపుతున్నాడు.

"ఆగురోరె, ఆగు! ఆగొరే బిడ్డికీ! గోనిసంచలగాపు. నక్క ఎరగని బొక్కల్రా? ఓరె, మీ కొండోలు మాయలు, నానెరగనివా? నీ సంగత్తెలిసే, నువ్విలాగ, కెమిశీల తోవదప్పించేసి, నా బాకీకి నామాలెట్టీసి, యిలాగ దొంగసాటుగ సరుకమ్ముకుంతావని తెలిసే వొచ్చాన్రా. ఎత్తు, ఎత్తు, ఆ బస్తా తిన్నగెత్తి, కెమిశీల తోవల నా బండి వున్నది, బండిలయెయ్యి, ఎత్తుర బస్తా" అని గదమాయించాడు సవర్రాజు.

బిడ్డికోడు నవర్రాజుకి ఎదురుపలక లేదు. బస్తా మూతికట్టు వెదుకుతూ మౌనం వహించాడు.

"ఎత్తమంటే మూటెత్త వేంరా కోదునాకొడకా? ముంగిపోతులాగ పల్లక అటిటూ తిరుగుతావేటి?" అని మల్లీ కేకేసాడు.

"ఈ పండు మేట్రుగోరి కిచ్చీసాను సావుకారి బావ్"

"మరి, నా బాకీకి నీ పెళ్ళాన్నిచ్చేత్తావేటిరా?"

"ఒసేటి నున్నగ గుండయిపోతావు? యేటా పీకమీదగూకుంతావు. వొట్టి సేతుల్తోటెల్లవు. యేదో వొకటి కొలిసికెలిపోతావు... యింకా బాకీ అంతావు"

"యేటీ? యేటేటీ?? బాకీ లేదంతావా అయితే??? ఓరె, ఓరె కొండోడా కళ్ళు పేలిపోగలవురా. తీర్చలేకపోతే ఈ యేడుగాక పోతే మరో యేడు అను. అంతేగానీ బాకీ లేదనకు.

జాకర దేవత సాక్షిగ, యిదిగీ భూమ్మీద మొలిసిన యీ తుంగదుబ్బుని పట్టుకొని – సావుకారీ నీకు నీను బాకీలేను – అని ఒక్కముక్క అనీరా! అనీసి, తుంగదుబ్బు తెంపీరా! సాల్ను, ఎల్లిపోతాను. పాపం, పున్నెం ఆ దేవత సూసుకుంతాది" అన్నాడు సావుకారి.

"ఈ మాత్రానికి పెమానకాలు యేల? ఇత్తాన్నే. ఈ పాలి పండుయేరీసి, నీకిత్తాను. ఇప్పుడికి డబ్బులవుసిరమున్నాది. పిక్కురోడికి ఊష్టమొచ్చినపుడు దేవతకి కోడీ, కోకా మొక్కుకున్నాము. కోక కొనాల...." చెప్పాడు బిడ్డికోడు.

"తిన్నగడిగితే, మీ కోదోలు నొంగరురా! నిన్నూ, కేంపు పోలీసులి కొప్పజెప్తే, ఆలే కక్కించుతారు నా బాకీ. పద, పదరా కేంపు కాడకి" అని బిడ్డికోడి పీకమీద చెయ్యేసి, తోసుకు వెళ్ళబోయాడు సవ్రాజు.

"ఈసారికి మంగన్న నొదిలేయండి సవ్రాజుగారూ. పాపం, మొక్కుబడి అంటున్నాడు. ఇంకా చింతపండు పంట వుంది కదా. మీ కళ్ళముందున్నోడు... ఎటు పోతాడు!" అని మేస్టారు సర్దిచెప్పబోయారు.

"చాల్చాల్లే. చెప్పొచ్చావు. అత్త సొమ్ము అల్లుడు ధారోసినట్టుగ నా బాకీకి నువ్వాగమంతన్నావు. యేమి? అంతనమ్మక మున్నోడివయితే, నువ్విపుడు డబ్బిచ్చేసి మరోసారి చింతపండుకి రాగూడదూ?" అని ఎదురు పొడుపు పొడిచాడు సవ్రాజు.

"నిజమే. మంగన్న మీద నమ్మకం లేక కాదు. ఎక్కడ కొమరాడ, ఎక్కడి తులిసొలస! మరోసారి నేను రావాలంటే, సెలవు కుదరాల. ఇంత దూరాభారం రావాల. మీరంటే, యిక్కడివాల్లే, వీళ్ళ బతుకుల్తో నిత్య సంబంధమున్న వాళ్ళు. అందుకని, మీరే ఆలోచించాల."

"ఆలోసించానుగాబట్టే యిన్నాళ్ళాగాను. యేటకేటా, యేదో ఒకటి సెప్తుతుంటాడు. నీనూ వుపేక్షించినన్నాళ్ళూ వుపేక్షించాను. ఇక మరివొదల్నుగాక వొదల్ను. పదరా కోదునా కొడకా. సింతపండెత్తురా" అని బిడ్డికోడ్ని బస్తా ఎత్తమని బలవంతం జేసాడు సవ్రాజు.

నోరులేని బిడ్డికోడ్ని దబాయించినందుకో, తను కొనుక్కున్న చింతపండును పట్టుకుపోజూసినందుకో... గానీ..... సవ్రాజు మీద మేస్టారిక్కోపమొచ్చింది.

"ఆగండి, సవ్రాజుగారాగండి, బిడ్డికోడు మీకు బాకీయో, లేకపోతే బెదిరించి మీరు ఒట్టినే పట్టుకెల్లబోతున్నారో నాకు అనవసరం. కానీ, ఆ సరుకు నాది. నేను సొమ్మిచ్చి కొనుక్కున్నాను. నా సరుకుని పట్టుకెల్లడానికి వీలులేదు?" అన్నారు మేస్టారుగారు.

"యేటేటి? ఆడు బాకీలేడా? నేను బెదిరించి వొట్టుకుపోతన్నానా? ఈ సరుకు నీదంతావా? ఇదొట్టుకెల్లడంకి యీల్లేదంతావా? యేటి నా సంగత్తెలిసే అంతన్నావా?"

"మీరేం కేకలేసి మీ సంగతి చెప్పక్కర్లేదు. అది నేను కొనుక్కున్న సరుకు, మీరెవరయినా, ఎంతటివారైనా నా సరుకుని నేనొదల్ను" అన్నారు మేస్టారు బింకంగా.

"ఇదిగో, నీను తల్సుకుంతే నిన్ను నిలబడిన – పాటుగా జెయిల్లో తొయ్యించీగల్ను. యిలాగెల్లి, పోలీసుకేంపుల చెప్పానంతే సాల్ను, సత్తెం మేస్ట్రు శిష్యుదువనీ, మల్లీ యీ కొండోల్ని రెచ్చగొడతన్నావనీ, చెప్పానా సాల్ను. పిట్టని గాల్చినట్టు నిన్ను కాల్చి చంపీగల్రు" అని బెదిరించబోయాడు.

నిజంగా, సవ్రాజుకి అంతబలముంది. సవ్రాజు అసలు పేరు శ్రీరాములు. శ్రీరాములు పాతికేళ్ల వయసు వరకూ, ఏజెన్సీకి పదిమైళ్ల దూరాన గల పల్లపు గ్రామంలో

పెరిగాడు. అప్పుడు సవారగా పెరిగిన సర్వే చెట్టులా వుండేవాడు. హైస్కూల్ చదువుతో చాలించి, ఊరిలో పోరంబోకుగా తిరిగేవాడు. ఈ తిరుగుళ్లకి కళ్లేలు బిగించాలని తండ్రి శ్రీరాములుకి పెళ్లి చేశాడు. 'గుణానుపురం' జోగినాయుడుగారి కూతురు మెడలో తాళి కట్టించాడు. తాళికట్టేడే గానీ, పెళ్లాం జోలికి పోలెదెప్పుడూ! శ్రీరాములు ఊరిమీద అప్పుడు కోడిలాగ తిరిగేవాడు. చూసి, చూసి పెళ్లం కొన్నాళ్లకి.... మలేరియా ఇన్స్పెక్టరుతో లేచిపోయింది! అంతే! శ్రీరాములుకి దశ తిరిగింది, అక్కడ్నించే తారాజువ్వలా మీదికి లేచిపోయాడంటారందరూ!

పెళ్లం మరోడితో లేచిపోయింది. తండ్రీ కొద్దిరోజుల తర్వాత చనిపోయాడు! ఎపుడో తన చిన్ననాటే తల్లి చనిపోయింది. ఇంటిలో ఆడదిక్కులేదు అక్కా చెల్లెల్లులేనందున! అడ్డూ ఆపూ లేదు అన్నదమ్ములేనందున! పెద్దాచిన్నా తనే అయ్యాడు. తండ్రి చాటున విచ్చలవిడిగా తిరిగిన శ్రీరాములు, దొంగచేతికి తాళాలొచ్చిన తీరుగా బాధ్యతలెత్తుకోవల సొచ్చింది. అప్పుడు కోడె, కాడెద్దు కావలసొచ్చింది. ఊరిమీద తిరుగులు మానుకొని పొలమూ, ఇల్లూ చూసుకోవలసొచ్చింది. అంచేత ఎవరిపూచీ, పేచీ లేకుండా, ఎవరితోనూ కూడకుండా; కష్టపడటం, వ్యవసాయం చేయటం యిదే జీవనమయ్యింది కొన్నాళ్లు.

ఊరిలో పోరంబోకుగా తిరిగినప్పుడెప్పుడో కన్నేసి.... వీలుగాక, శ్రీరాములు వొదిలేసిన వాళ్లల్లో ఒకామె సావిత్రమ్మ!

ఇప్పుడామె శ్రీరాములు మీద కన్నేసింది.

శ్రీరాములకీ సావిత్రమ్మ నచ్చింది. సావిత్రమ్మ మెడకీ చేతులకీ గల పదహారు తులాల బంగారం నచ్చింది. అన్నిటికంటే, శ్రీరాముల్ని తనింట్లోనే చాటుగా సుఖపెట్టి, భవిష్యత్తు బ్రతుకు ప్రణాళికనంతా తయారుజేసి చెప్పిన సావిత్రమ్మ ధైర్యమూ, తెలివితేటలూ మరీబాగా నచ్చాయి.

అంతే; శ్రీరాములు సావిత్రమ్మని లేపుకొచ్చాడు.

సావిత్రమ్మతో కొన్నాళ్లు – ఆమె తాలూకా కన్నవారి ఊరిలో గడిపాడు. ఆ ఊరు ఏజెన్సీకి దగ్గర! అక్కడుండగా సావిత్రమ్మ ఒంటిమీది బంగారం కొన్నాళ్లు బ్యాంకులో వుండిపోయింది. అంచేత, చేతికి కొంత డబ్బొచ్చింది. ఆ డబ్బు తోటి –

శ్రీరాములు చేత ఏజన్సీలోని ఆకూ, ఆలములూ, కర్రాకంపా, పుల్లాపుడకా, యిప్పపప్పులూ, వుసిరికిపప్పులూ, కందులు కావిళ్లు, చింతపండు, తుమ్మబంకా, తుడుసుకొనే చీపుర్లూ..... ఒకటేమిటి దొరికిన ప్రతి వస్తువునీ కొనిపించింది! వాట్ని పల్లానికీ, పట్నానికీ తోలి అమ్మించింది సావిత్రమ్మ!

పల్లంలోన, పట్నంలోన దొరికే పకోడీ పొట్లాలూ, చుట్టల కట్టలూ, పొగాకూ...

అగ్గిపెట్టెలూ, కరకజ్జిమూ, కంపెనీబాడీలూ.. ఒకటేమిటి వింత వింత సరుకులు ఏజన్సీకి తెప్పించి అమ్మించింది.

అప్పూసప్పులిప్పించింది. బాకీ సాకీలూ.. కాతాలూ నడిపించింది! ఇలా, ఏజెన్సీ దగ్గరగల ఆ ఊరినుండి... ఆ తర్వాత ఏజెన్సీలోకి మకాం మార్పించింది శ్రీరాముల్ని సావిత్రమ్మ.

ఏజన్సీకొచ్చాక శ్రీరాములు అప్పుకింద ఆవు పడ్డలూ, వడ్డీకింద వూటమళ్లూ, బాకీసాకీలకి బళ్లూబక్కలూ సంపాదించాడు. కొండల్లో కొలువుదీరాడు. పల్లపు భూములూ పోడు పంటలూ; పాలేర్లూ, కూలోల్లూ లెక్కలేనంత భూమీ డబ్బూ.... సంపదా హోదా సంపాదించి అదిగో ఆ ఏజెన్సీలో – ఆ సవరలకు రాజుగా శ్రీరాములు 'సవర్రాజు' అయ్యాడు.

ఇంతటి వాడు గూడా –

ఆ రోజుల్లో, గొడ్డలి తిరగేసిన గిరిజన పోరాట రోజుల్లో, పట్నం పారిపోయి దాక్కున్నాడు. ఏజెన్సీని మర్చిపోయాడు. భూమినీ, పుట్టనీ, ఇల్లునీ, బళ్లనీ, భాగ్యాన్నీ వొదులుకున్నాడు. ఎందరెందరో తుపాకీ రక్షణ వలయాల మధ్య తుళ్లిపడి బెదిరి, నిద్ర లేచే రాత్రులు గడిపాడు. ఎంత రాతిగోడల భవంతిలో వున్నా, ఎన్ని ఉక్కు శిరస్త్రాణాల తుపాకీల రక్షణలోనున్నా గుండెల్లో భయమే! ఆస్తిపోద్దనే భయం! ఆయుష్షు మూడుతుందనే భయం!! గుండెల్లో అహరహం ఆందోళన!!

తుళ్లిపడి నిద్రలేచే రాత్రుళ్లు, నీడని చూసి హడలిపోయే ఎన్నో పగళ్లూ గడిచిపోయాయి. మళ్లీ, యీ వేళ మామూలే. పాత చరిత్రే పునరావృతమవుతోంది. ఇవ్వేళ ఏజన్సీని కలిపేసుకు తిరిగేస్తున్న బస్సురోడ్లూ, టెలికమ్యూనికేషన్ ఆఫీసులూ, పోలీసుస్టేషన్లూ, కేంపులూ, కల్లోలిత ప్రాంతాలూ, కుట్ర కేసులూ, ఎన్‌కౌంటర్లూ, లాకప్పులూ, లాఠీలూ, తుపాకులూ శ్రీరాముల్ని మళ్లీ ఏజన్సీలో సవర్రాజుగానే నిలబెడుతున్నాయి. మరింత ధైర్యాన్నిస్తున్నాయి.

ఆ ధైర్యంతోనే మేస్టార్ని భయపెట్టబోయాడు. అయితే, మేస్టారు భయపడలేదు. బతుక్కి బడిపంతులే అయినా బంధుత్వం పెద్దవాళ్ళతో.....అంచేత –

"వెళ్లవయ్యా. వెళ్లు. నువ్వు సవర్రాజువో, సత్తెప్పవో నాకు తెలీదనుకోకు. నీ బతుకు నాకు వూరాగా తెలుసు. నా దగ్గిర డాబు చెయ్యకు. కోదోడ్ని గాదు – వొడికి పోడానికి! నేనే తల్చుకుంటే, నీ వ్యాపారానికి – యీ అడివిల అగ్గి అంటించీ గల్ను.... జాగర్త! కొండోళ్లకాడ ఎగిరినట్టు నాకాడ ఎగరకు. వెళ్లు, చింతపండొదిలేసి తిన్నగెళ్లు. చింతపండు మూటమీద చెయ్యేసేవంటే చిదకదంతాను" అని రకరకాలుగా భయపెట్టీ, వార్నింగులిచ్చీ అదరగొట్టేసాడు సవర్రాజుని.

సవ(రాజుకు పులి గాం(డింపులా విన్పించాయి మేస్టారి మాటలు.

మేస్టారు – నువ్వు ఆడసత్తెప్పవేగానీ సవ(రాజువి కావు – అన్నట్లు మాట్లాడినందుకు రోసమొచ్చింది. వ్యాపారానికి యీ అడివిలో అగ్గెట్టించీగల్ను – అనేసరికి అంపరమెత్తింది. చింతపండు మూటమీద చెయ్యేస్తే చితకదంతాను – అనే సరికి దడపుట్టేసి ఒడుకొచ్చేసింది. మరేమీ అన్లేక, తలదించుకొని, మొహం మాడ్చుకొని చేతకాని నక్కలా నడిచాడు అక్కడి నుండి సవ(రాజు!

మేస్టారి హెచ్చరికల్తో తోకముడిచిన సవ(రాజుని చూసిన బిడ్డిక మంగయ్యకి ఆనాటి గిరిజన సంఘం గుర్తుకొచ్చింది.

అప్పట్లో, ఓసారిలాగ, ఓ సావుకారి – ఎవరింటిలోనో దూరి దోతర్ఫీగా కందులు ఎత్తుకెళ్లబోతుంటే, సంఘపోల్లు వొచ్చి అటకాయించారు. ఆ సావుకార్ని తిన్నగా వలస మొగానున్న చెట్టుకాడకి లాక్కొచ్చి, ఆ చెట్టుమీదున్న ఎ(రజెండాని చూపి, జా(గత్త అటుచూడు. చూసావుగా ఎ(రజెండా! యీ వలస సంగమయ్యింది. ఇక్కడ నువ్వు దోతర్ఫీ, దోపిడీ చేస్తే నీ పని అయిపోద్ది – అని హెచ్చరించిన సంఘటన మనసులో మెదిలింది. సావుకారి హడలెత్తి పారిపోయిన తీరు గుర్తొచ్చింది. పిడికిలి బిగుసుకుంది. చేతిలోని దబ్బలం వొంగిపోతుంది. అది జూసి, మేస్టారు –

“బిడ్డికోడా! యేటలాగ దబ్బలం వొంచేస్తున్నావు? బస్తా కుట్టీడమయిపోయిందిగా. యేcవిటాలోచిస్తున్నావు?” అని పిలిచాడు.

మంగయ్య అప్పుడు మామూలుగా అయ్యాడు. ఆలోచనలాపాడు.

“లెగు, లెగు. మూట కొమరాడ వాళ్ల బండిమీద వేద్దువు పద. ఇదుగో నీకు రావాల్సిన డబ్బు” అని మేస్టారు డబ్బిచ్చాడు.

డబ్బందుకొని మొలగోచీలో దోపుకొని దాచి, చింతపండు మూటని కొమరాడ వాళ్ల బండిమీద వేసాడు బిడ్డిక మంగయ్య.

* * *

పొద్దు పోయింది. తులిసొలన నిండా చీకటి అలుముకుంది. పోడు మీద అక్కడక్కడా దబ్బాలు మోగుతున్నాయి. చింతగీర్లు గీ పెడుతున్నాయి. నక్కలు ఊళలేస్తున్నాయి. తులిసొలన నిద్రలోకి జారుతోన్న వేళ!

గంటిజావలో పులుసు కలుపుకొని పిండి వొడియం ముక్క నంచుకొని తినేసి, లేచి గడపలో నులకమంచం వాల్చి జారబడ్డాడు నిద్రకి, బిడ్డికోడు. పెళ్లం ‘సుక్కి’ గిన్నెలూ, దాకలూ కడుక్కుంటోంది పెరట్లో. పక్కింటిలో ‘పేసిని’గాడు “అంబా తకాడే..... ఆజామనాడే” కూనిరాగం తీస్తున్నాడు. వీధి మొగాన కుక్క ఎందుకో అరుచుకుంటూ పారిపోతోంది.

వీధిలో టార్చిలైట్ల వెల్తురు పడుతోంది. బిడ్డి కోడి మంచంపైన బడింది. బిడ్డికోడి మొహమ్మీద పడింది. కళ్లు తెరిచాడు... బిడ్డికోడు. వెల్తురు ఆరిపోయింది. ఎదురుగా లాఠీలెత్తి నిలబడిన పోలీసులు, మేక పీక మీదకి కత్తి ఎత్తి నిలబడ్డ కసాయెల్లాగున్నారు.

గభాల్న మంచం దిగాడు బిడ్డికోడు.

"యేట్రా బిడ్డికోడా? కొవ్వు బలిసిందేట్రా? సవర్రాజు నెదిరిత్తావటరా? సంగపోలిని పిలుత్తావటరా? మీటింగు లెడతన్నావాట? యెవుడ్రా..... ఆ మేస్త్రు? యేడిరా?" అన్నాడు ఓ పోలీసు! మాటల్లో కావలసినంత కాకీ భాషను ఉపయోగిస్తూ!

బిడ్డికోడు హడలిపోయాడు. హమ్మ! సావుకోరో!! – అనుకున్నాడు.

"ఓరె! మీకింకా బుద్దిరాలేదురా. పెద్దోలితోటి తగువులొద్దర్రా అంటే యిన్రుకదా! పెద్దోలితోటి తగువంటే – ఆళ్ల తరుపు ప్రభుత్వం దిగుతాది. ప్రభుత్వం తోటి యుద్ధం చెయ్యడానికి నీ పార్టీ వోలికాడ, నీకాడ యేటున్నాయి? ఏటంబాంబులున్నాయా? మిషన్ గన్నులున్నాయా? మిలట్రీ వున్నాదా? యేటీలేదు. మీవోళ్ల ఒంటికి శేరు చితకల్లేవు. చేతిల – కర్రల్తప్ప మరేటీలేవు, గవర్నమెంటు చేతిల మీకు సావుతప్పదు.

సావరా, నా కొడకా. నిన్నిపుడు సావగొడితే యీ వొలసోల్లకి బుద్దొస్తాది" అని లాఠీలతో బిడ్డికోడిని చావబాదుతూ, పోలీసుకేంపుకి లాక్కెల్తూ –

"జాగర్తొర్రె! జాగర్త. యింకెప్పుడూ యీ వొలసల మాకుగానీ, సవర్రాజుకిగానీ, గవర్నమెంటుగ్గానీ ఎదురుపలకగూడదు. ఎపుడూ సంగం కవుర్లాడగూడదు. కుక్కిన పేనుల్లాగ నోర్మూసుకుండాల! లేపోతే, మీ తల్లోని జెజెమ్మలు గూడా హడలెత్తి ఛస్తారు. జేగర్త!" అని, యేడుస్తోన్న సుక్కినీ, జాలిగా బిడ్డికోడ్ని చూసే వలసోల్లనూ హెచ్చరించి.... బిడ్డికోడిని పట్టుకుపోయారు పోలీసులు.

రాత్రి చాలా పొద్దుదాకా బిడ్డికోడు పోలీసుల పైశాచికత్వాన్ని అనుభవించాడు. గతం ఒడిలోనూ, వర్తమానం భయంలోనూ.... కన్పించని భవిష్యత్తులోనూ – ఒళ్లు పచ్చి పుండులాగా సొమ్మసిల్లిపోయాడు!.... బిడ్డిక మంగయ్య.

తెల్లగా తెల్లవారింది.

పోలీసువారికొక కోడి లంచం యిచ్చుకునే షరతుపైనా, శ్రీరాములు సావుకారి బాకీ వారంరోజుల్లో తీర్చేసే పూచీపైనా.... మంగయ్యను పోలీసులు విడిచిపెట్టారు. పచ్చి పుండయిన ఒళ్లుతోటి ఇల్లుజేరిన బిడ్డికోడ్ని చూసి వలసంతా మూగగా రోధించింది. సుక్కి చేతిమెటికలు విరిచి పోలీసుల్ని తిట్టింది.

బిడ్డికోడు మళ్లీ మామూలు మనిషి కావడానికి వారంరోజులు పట్టింది. మామూలు మనిషయ్యాక బిడ్డిక మంగయ్యకు – పోలీసులకివ్వాల్సిన కోడీ, సవర్రాజుకి తీర్చాల్సిన బాకీ గుర్తుకొచ్చాయి.

కోడి పుంజున్నాది గానది, జాకర్దేవతకి మొక్కుకున్నది. మొక్కు తీరసప్పోతే దేవతకి ద్రోహం. కోడివ్వకపోతే పోలీసోలిక్కోపం. యేటిసెయ్యిడం? – అని ఆలోచించుకుంటూ, అంతకుముందు ఏరగా మిగిలిన చెట్లకున్న చింతపండు యేరుకు వచ్చేందుకు బయల్దేరాడు మంగయ్య. చెట్లు అన్నీ యేరితే బరువుగా ఒక కావిడి పండు దొరికింది.

బతికుంటే బలుసాకుతిని బతకొచ్చుగానీ, సవర్రాజు బాకీ మరి వుంచగూడదు. తీర్సియాల – అని అనుకుంటూ, చింతపండు కావిడ్ని సవర్రాజుకిచ్చేందుకు బయల్దేరాడు. కోలగూడు వదిలేసి తిరిగే కోడి పిల్లల్ని తన్నుకెలిపోయే గెద్దలాగా మంగయ్య మీద పడ్డారు గిరిజన కార్పొరేషన్ వారు.

ఏజెన్సీలోగల పంటలు వ్యాపారులు దోచుకుంటున్నారని, పట్నంలో ఆ సరుకుల్ని అధిక ధరలకు అమ్మి వారు గడించుకుంటున్నారనీ, దానివల్ల గిరిజనులు నష్టపోతున్నారనీ ప్రభుత్వం వారు గిరిజన్లను ఉద్ధరించేందుకు తులసోలసకు దగ్గరగల కెమిశీలలో కార్పొరేషన్ గోడౌన్ పెట్టారు.

"ఎట్రోరె, కొండ నా కొడకా? చింతపండెటురా ఒట్టుకెల్తన్నావు? మీరిలాగ సాటుమాటుగ సరుకంతా అమ్మీయండి. గోడాం కట్టించి, కూచున్న మా కార్పొరేసనోలిమి యీగలు దోలుతాం. ఎత్తుకుముత్తుం తూసినా ఆ సావుకార్లనే నమ్ముతార్రా మీరు. చాటుమాటుగా సరుకు ఆ సావుకార్లకే అప్పజెప్పేసి నష్టపోతుంటార్రా మీరు. అందుకే, మిమ్మల్నుద్దరించటం ఆ గవర్మెంటుగాదుకదా, దానబ్బతరం గూడా కాదురా!" అనికూడా తేల్చేసి; బిడ్డికోడ్ని చింతపండు కావిడితో గోడాం వద్దకు లాక్కుపోయారు.

చింతపండు తడిగా వుందనీ, ఎండితే తూకం దిగిపోద్దనీ చెప్పి; అంత బరువు కావిడినీ ఇరవై కేజీలకు తూచారు. కేజీ రూపాయి పదిపైసల లెక్కన; ఇరవై రెండు రూపాయలు చేతిలో పెట్టి – బిడ్డికోడ్ని ఉద్దరించారు కార్పొరేషన్ వారు! – యేటి సెయ్యడం? సవర్రాజు సంపేత్తాడు గావాల? యీ డబ్బులిత్తే వొడ్డీకింద గుటకలేస్సి... అసలేదిరా నా కొడకా అని ఎగిరి గెంతుతాడు. ఏటి సెయ్యిడం?– అని ఆలోచిస్తూ, దిగాలుగా ఇంటివైపు నడిచాడు మంగయ్య! ఇల్లు కొద్దిదూరంలో వుందనగా అక్కడ నుండి కనబడుతోన్న దృశ్యం చూసి మంగయ్యకి ఇంటివైపు అడుగుడపలేదు.

– తన యింటిముందు కేంపు ఎస్సయి, జవాన్లిద్దరూ నిలబట్టమూ, లాఠీలూపటం కన్పించింది. సుక్కి వారితో యేఁవిటో చెప్తోంది చేతులూపుతూ. ఆ దృశ్యం చూసి మంగయ్యకి కాళ్లు వడికిపోయి, గొంతు తడారిపోతోంది. ఇంటివైపు కాకుండా తోవదప్పించేసి అడవిలోకి పారిపోయాడు. ఎండ మండిపోతోంది. పిట్ట అలికిడి గూడా లేదు. పోడు మీంచి వేడిగాలికి ఎండలో నీడలు పరుగెడుతున్నాయి.

ఇంటికాడ పోలీసులు సుక్కిని కోడిపుంజు యిమ్మని అడుగుతున్నారు. సుక్కి – బావో! జాకర దేవతకి మొక్కినాము. వొల్లగాదు – అంటోంది. అయినా, ఎస్సయి పుంజు పట్టుకోమని జవానుకి ఆర్డరేసాడు.

జవాను టోపీ తీస్సి, చేటలాగ పట్టుకొని "ద...ద...ద...ద..." అని కోడిని చేటలోకి పిలుస్తూ ఒంగోని కోడివైపు నడుస్తున్నాడు. దగ్గరకు వెళ్లేసరికి రెక్కలు టప, టపా కొట్టుకుంటూ కోడి ఎగిరిపోతోంది. మెల్లిగా నడుస్తున్నాడు పిలుస్తూ. మళ్లీ అల్లంత దూరం ఎగిరిపోయింది కోడి. రెక్కలు కొట్టుకుంటూ రెండు వెంట్రుకలు రాల్చింది.

ఏడ్చుకుంటూ, జవాను వెనకాల మొత్తుకుంటున్న సుక్కిని ఎస్సయి లాఠీతో పొడిచి తోసేస్తూ – "గోల సెయ్యకే కోదులంజకానా. పుంజెగిరిపోతుంది. నోర్మూసుకో" అని కేకలేస్తున్నాడు. మొత్తానికి కోడి దొరకలేదు. కోపంతో సుక్కిని లాఠీల్తో బాదేసి –

"సాయంత్రం కోళ్లు మూస్తారుగదా. అప్పుడు పట్టుకొని కేంపుకొచ్చి యిమ్మను.... నీ మొగుడ్ని. లేపోతే – నిన్నూ, నీ మొగుడ్నీ కేంపులో మూస్సి పులుసొండుకు తినేస్తాము" అని అరుస్తూ వెళ్లిపోయారు పోలీసువారు.

ఇదంతా యిరుగూ పొరుగూ.. వలస వారంతా చూస్తున్నారు. గుండెల్లో కోపం రాజుకుంటోంది. అయినా భయం! భయంకరంగా తమపై జరిగిన మారణకాండ ... మర్చిపోలేదింకా వారు.

అయినా, పోలీసులు వెళ్లిపోయాక అంతా గుమిగూడారు. తలా ఓ విధంగా వారి భాషలో గొణుక్కున్నారు. చిన్నాభిన్నమైన వారి సంగాన్ని తల్చుకున్నారు.

పోలీసుల భయంతో అడివిలోకి పారిపోయిన మంగయ్య పొద్దుపోతున్న వేళ తిరిగొస్తున్నాడు, వలసదారి పట్టి.

తోవలో ఒకచోట 'ఈళ' సన్నగా విన్పించింది. మంగయ్య ఆగిపోయాడు. చూస్తే, పక్కగా పొదల్లోంచి ఒక మనిషి... భుజాన సంచీతో! నవ్వుతూ ఎదురుగా వస్తున్నాడు. దగ్గరయ్యాక, మంగయ్య పోల్చుకున్నాడు ఆ వ్యక్తిని! పోల్చాక, ఆనందంగా ఆ వ్యక్తి దగ్గరకు పరిగెత్తి చేరుకొని –

"కామ్రేడ్....! నువ్వాకామ్రేడ్.. అబ్బా... ఎన్నాళ్లకి కామ్రేడ్. ఎన్ని పంటలక్కనిపించావు! నువ్వేటయిపోనావో తెల్దు. ఎక్కడున్నావో తెల్దు. సూడు కామ్రేడ్... సూడు... మా బతుకులు. ఇంతమంది, యిన్ని బాధలనుబగించినాక, మళ్లీ మా బతుకులు మొదలుకొచ్చినాయి. మళ్లీ సావుకార్లు పులుల్నాగ పడిపోతన్నారు. పోలీసోలూ, కార్పొరేషనోలూ ఎర్ర జిందవల్నాగ సీరుకు తింతన్నారు. తల్లిలేని పిల్లల మయిపోయినాం కామ్రేడ్.... మల్లా మీము. యేటి కామ్రేడ్? యిన్నాళ్లెక్కడున్నావు? యేటయినావు? సంగతులన్నీ సెప్పవా?" అని, ఉక్కిరి బిక్కిరిగా, అన్నీ ఒక్కసారిగా అడిగేసాడు మంగయ్య.

మంగయ్య బాధనీ, సంతోషాన్ని అర్థం చేసుకున్నాడు ఆ వ్యక్తి. మంగయ్య చేతిని, తన చేతిలోకి తీసుకొని గట్టిగా నిమురుతూ –

"చెప్తాను కామ్రే.. చెప్తాను. ఇన్నాళ్లూ నేను జెయిలులో వున్నాను. మూడు రోజుల కిందట వాయిదాకి కోర్టుకు తెస్తుంటే చిన్న అవకాశం దొరికి... తప్పించుకొచ్చాను. మన కామ్రేడ్లింకా యెంతోమంది జైళ్లల్లో వున్నారు. మొత్తం యీ ఏజెన్సీని తుపాకుల్తోటీ, పోలీసుల్తోటీ నింపింది గదా ప్రభుత్వం. దొరికినోడ్ని దొరికినట్టుగా కాల్చి చంపించింది. పార్టీలో అనేకులు కాల్పులకో, జైలు శిక్షలకో గురయ్యారు. నాయకులెంత మందో అమరులయ్యారు. గిరిజన గూడలన్నీ భస్మీపటలమయ్యేయి. మనోళ్లు అంతా పోడుకీ, అడివికీ, గూడేనికీ దూరమయ్యారు. ఈ పరిస్థితుల్లో యిక్కడ మన పోరాటం కొనసాగింపు దెబ్బతింది.

గానీ, నేడు మళ్లీ దేశంలో అనేక చోట్ల – బీహార్, బెంగాల్, తమిళనాడు.... యింకా అనేక రాష్ట్రాల్లోనా, మన రాష్ట్రంలో అనేక జిల్లాల్లోనా ప్రజలు తిరగబడుతున్నారు. పోరాటం నడిపిస్తున్నారు. మళ్లీ మనం గూడా యిక్కడ సంగాన్ని నిలబెట్టాల. పారిపోయి తిరిగొచ్చిన సావుకార్లనీ, పోలీసుల్నీ తరిమి తరిమికొట్టాల. మళ్లా ఏజెన్సీల మన ఎర్రజెండా ఎగిరించాల...." యిలా తోవకడల్లా అనేక విషయాల్ని చెప్తూ, ఏజెన్సీ గురించీ, తులిసొలస గురించీ కనుక్కున్నాడు, తులసొలన ముందున్న గూడవద్ద ఆగిపోతూ, అక్కడి ఉయ్యికి భీముడింట్లో రాత్రికి మీటింగు పెడదామనీ, తులిసొలసోల్లని... ముఖ్యంగా అప్పటి సంఘ బాధ్యుల్ని తీసుకురమ్మనీ చెప్పి.. మంగయ్యను పంపించాడా కామ్రేడ్!

పొద్దు పూర్తిగా వాటారిపోయింది. కోళ్లు యిళ్లు జేరాయి. పశువులు సాలలు జేరాయి. మంగయ్య ఉత్సాహంగా తులసొలస చేరాడు. ఇంటివద్ద భార్య యేడుస్తూ పోలీసుల వృత్తాంతమంతా చెప్పింది. ఇరుగూ, పొరుగూ గూడా అంతా చేరారు. తమ సానుభూతినీ, పోలీసులపై కోపాన్ని వెల్లడించారు. ఈ దుర్మార్గాల్ని సహిస్తూ ఎలాగ బతకటం? అని ప్రశ్నించారు.

అప్పుడు మంగయ్య వారికి కామ్రే గూర్చి చెప్పాడు. కామ్రే కలిగించిన ధైర్యంతో–

"అవును. మళ్లా మనం తిరగబడాల, సంగం మళ్లా నిలబడితె ఆ సవర్రాజు సావుకారి పోతాడు. యీ సొండోడు పోతాడు. పారెస్టోడు పోతాడు. పోలీసోడు పోతాడు. యీ దురుమారగపు రాజ్జెమంతా పోతాది. మన వొలసలు మనవవుతాయి. మన రాజ్జెం మనకొస్తాది" అన్నాడు.

మంగయ్య మాటలతో వలసోల్లంతా పోలీసుల గురించి మర్చిపోయారు. వారిలో అప్పటిదాకా గూడుకట్టుకున్న భయం, నిరాశా, నిస్పృహ, అచేతనత్వమూ అంతా

ఎగిరిపోయింది. నూతనోత్తేజం నిండుకుంది. పక్కవలసలోని 'కామ్రే'ని కలుసుకున్నారు ఆ రాత్రి!

❊ ❊ ❊

తెల్లవారింది. కోళ్లు పెంటమీదబడి కెలుకుతున్నాయి, మెరకలమీద పచ్చగడ్డి దుబ్బులు కొరుకుతున్న పశువులు - దుక్కులు దున్నే ఎడ్లూ.....

పోడుమీద జొన్న కంకులు లేత ఎండలో మెరుస్తున్నాయి. కొండలమీంచి నల్లటి మేఘాలు పారిపోతూ... ఎండపడిన చోట్లల్లా కొండలు ఎరుపెక్కుతున్నాయి. తులిసొలస బిడ్డిక మంగయ్య ఇంటిముందు కేంపు ఎస్సయి, జవాన్లూ, సవర్రాజూ నిల్చున్నారు. సవర్రాజు - యింటి లోనకి చూసి -

"ఒరె, బిడ్డికీ! రార్రారా, రారివతలకి...." అని పిల్చాడు.

బిడ్డికోడు రాలేదు. జవాబూ రాలేదు. ఇంటి ముందటి ద్వారానికి కట్టిన తడక తన్నుకొని పిల్లి పరుగెత్తుకొచ్చింది.

"కోదు నాకొడుకెటు పోనాడో?" అన్నాడు సవర్రాజు.

ఇరుగూ, పొరుగూ ఎవరూ అలికిడిలేదు. ఆ వీధిచివరన, ఎవడో ముసిలోడున్నాడు. ముంగటి కాళ్లల్లో మొహం పెట్టుకొని కూర్చున్నాడు. వాడిని పిలిస్తే - వాడు ఉలుకూ, పలుకూ లేకుండా చుట్ట అడ్డపోగేసుకొని, మొహం అటు తిప్పేసి ఊరుకున్నాడు.

"కొండ నా కొడుకులెవులూ అలికిడి లేదు. కోడిపుంజేటయ్యిందో సూడిమిరా. ఇంటిలదూరి..." అన్నాడు ఎస్సయి, జవాన్తో!

"కోడిపుంజు కేటి గాబరా? ఆడూ, ఆడిబాబూ వొట్టుకొత్తాడు. నా బాకీ సంగత్తేల్చవయ్యా బాబూ..." అన్నాడు సవర్రాజు ఎస్సయితో!

"నీకు మాత్రం అడ్డేటి? ఇంటిల దూరి, దొరికిందాన్ని దొబ్బు!" అని చెప్పాడు ఎస్సయి.

సవర్రాజూ, జవానూ యిద్దరూ వేర్వేరు అవసరాలతో గుడిసెలో దూరబోతుంటే, అడ్డపొగేసి కూచున్న ముసిలోడు వచ్చి -

"ఇదేటి బావ్? ఎవుల్నేకండా యింటిల దూరుతున్నారు? తప్పుగాదా? బిడ్డికోడొచ్చినాడంతే... మంచిదిగాదు మల్లా!" అని అడ్డుకోబోయాడు.

"ఎవుడువురా ముసిలి నా కొడుకా? ముడుకు ఇరగదంతే సరి. ఆ బిడ్డికోడి సంగతి గాదుగానీ, నీ సంగతి జూడిరిపుడు...." అని ఫెడేల్మని ఆ ముసిలోడి ముడుకుల మీద బలంగా లాఠీ వేసాడు ఎస్సయి!

దెబ్బకి ముడుకులు విరిగినట్లన్పించి, మొర్రోమని మొత్తుకుంటూ ఎస్సయి కాళ్లమీద పడ్డాడు. ఎస్సయి అందినకాడల్లా బూటు కాళ్లతో వాడ్ని తన్న సాగాడు.

సవ్రాజూ, జవాన్లూ బిడ్డికోడి ఇంటిలో దూరారు.

ఇల్లు మూల, మూలలా వెదికారు. యేమీ లేదు. దాకలూ, దోకెలూ, తట్టలూ, బుట్టలూ తప్ప. కోళ్ల గూడె ఖాళీగా వుంది. కోళ్లు పెంటలమీదకి ఎప్పుడో వెళ్లిపోయాయి. సవ్రాజుకి వంటపంచ మూలలో గూన కన్పించింది. అందులో చెయ్యి పెట్టి వెదికితే కర్ర తగిలింది. దాన్ని తీసాడు బయటికి. ఆ కర్రకు ఎర్రటిగుడ్డ చుట్టేసి వుంది. గుడ్డ విడదీసాడు. ఎర్రజెండా! సుత్తీ కొడవలి గుర్తులున్న ఎర్రజెండా. కొండ, కొండనీ కదిలించిన ఎర్రజెండా.... అది!

సవ్రాజు దాన్ని తెచ్చి ఎస్సయ్‌కి చూపిస్తూ –

“చూడండి. నా కొడుకులకి యింటిల సోలెడు గింజల్లేవు. ఒక గుడ్డముక్క లేదు. ఒక గిన్నె లేదు. గానీ, నా కొడుకు జాగర్తగా యిదిగీ జెండాని గూనల దాసాడు. అంటే, యీ నా కొడుకులికి యీ జెండా మీద యింకా ప్రేమవున్నాదన్న మాట! మళ్లా, ఈ ఎదవలు జెండాలు బడతారన్నమాట!” అని అన్నాడు.

ఎస్సయి, ఆ జెండాని అందుకొని, దాన్ని ఎత్తిపట్టుకొని, మరో చేత్తో, ముసిలోడిని నిలబెట్టి–

“పడతారు.... పడతారు... ఈళ్లు జెండాలు పడితే, మీము తుపాకులు పడతాము. పిట్టల్ని కాల్చినట్టుగ కాల్చుతాము. సూడు. ఇదిగో. నీముందరే.... యీ జెండానీ, యీ ముసిలోడినీ కలిపి అగ్గిబెట్టి తగలబెడతాను...!’ అని అంటూ, అగ్గిపెట్టె జేబులోంచి తీసాడు.

ముసిలోడు గగ్గోలు పెడుతున్నాడు ప్రాణభయంతో!

ఇంతలో ప్రళయ ఘోష విన్పించింది. మంగయ్య ఇంటిముందర, పోలీసుల చుట్టూ.. సవ్రాజుని కలుపుతూ కర్రా, కత్తీ, గొడ్డలీ పట్టిన తులిసొలన ప్రజలు నిలబడ్డారు కేకలేస్తూ!

జనంలోంచి మంగయ్య ముందుకొచ్చి, ఎస్సయి మీదకి గొడ్డలెత్తాడు. ఎస్సయి చేతిలోని అగ్గిపెట్టె పడిపోయింది. ఎర్రజెండా వొదిలేసాడు. ముసిలోడు దాన్ని అందుకొని, చేయి ఎత్తి జెండా ఎగరేసి ఏదో అరిచాడు!

“కాస్కోండొరే..... కాస్కోండి. ఒరే పోలీసోడా!.... మీరు మావోళ్లని నాశనం జేశారు. మమ్మల్ని జెయిళ్లదోసారు. మా ఎముకలిరిసారు. మమ్మల్ని కాల్చి సంపారు. మా భూములు మాకొదిలీసి, మా సంపదలు కొదిలీసి, మామీద పెత్తనాలొదిలీసి పట్నాలు పారిపోయిన యిదిగీ సావుకారి నా కొడుకులికి (సవ్రాజుని యీడ్చుకొచ్చి, చూపుతూ) మళ్లీ ఊతమిచ్చారు మీరు. మీరూ, మీరూ కలిసి మమ్మల్ని నరుకోతలు గోత్తన్నారు. మా బతుకుల్ని దిన దిన గండంజేత్తన్నారు. యీ దిన దిన గండం పోవాల. యిక్కడ్నిండి, యీ

అడివి నుండి, యీ హొలసల్నిండి, యీ కొండల్నిండి మీ గవర్మెంటూ, మీ తుపాకులూ పోవాల! దురుమారుగపు జాతి దుంప నాశినమయిపోవాల.... అప్పుడు తప్ప మాకు బతుకుల్లేవు. అంతదాక మీము గొడ్డలి దించము.

ఎందరో సచ్చిపోనారని, ఎన్ని బాధలో అనుబగించినామని... ఎల్లకాలం బెదిరిపోయి వుండిపోతా మనుకొన్నావు గావాల! ఇంటిపెద్ద సచ్చిపోతే పోడు సెయ్యడం మానేత్తన్నామేటి? తరాతోలిమి సెయ్యిడింలేదా? ఇదిగిదీ అంతే! మా బతుకులకి పట్టిన చీడలాటి మీరు పోయిందాకా, మా సంగం రాజ్జెమేలేదాకా... పోయినోలు పోయినా, వున్నోల్లిమి దెబ్బలాడతాం. మీరు సేసిన రక్తమండలానికి బదులు... అంతకి మరంతా బదులు తీసుకుంతాము. కాసుకోరా...” అని గొడ్డలెత్తాడు మంగయ్య.

ఆ దెబ్బకి దొరక్కుండా జనం కాళ్లల్లోంచి దూరి తప్పించుకు పారిపోసాగాడు ఎస్సయి.

ఓర్నాయినో! దురుమార్గపు కొడుకో!! అని పరుగెత్తాడు సవర్రాజు. జవాన్లు అయిపే లేరు. వారిని వెంట దగులుతూ తులిసొలస కదిలింది ఆయుధాలతో!

కొండమీద నీడల్లా పడిన మేఘాలను తూర్పు నుండి సూర్య కిరణాలు తరిమేస్తూ.... కొండల్ని ఎరుపెక్కిస్తున్నాయి! ★

*‘సృజన’ అక్టోబర్ 1983*